సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



పురోగతి లేని బందరు లైన్ !

నరసాపురం – మచిలీపట్నం మధ్య 67 కిలోమీటర్లు కొత్త రైల్వే లైన్ నిర్మిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించి ఏడాది గడిచినా ఎలాంటి పురోగతి లేదు. 8లో ▸



ప్రాణం తీసిన ఈత సరదా

ఈత సరదా ప్రాణం తీసింది. ద్వారకా తిరుమల మండలం తిరుమలంపాలెంలో ఈత కొడుతున్న బాలుడు నీట మునిగి ప్రాణాలు కోల్పోయాడు. 8లో ▸



మద్దిలో పూజలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో మంగళవారం ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి




మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): గర్భిణులు, బాలింతలకు అంగనవాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రగతిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు అందుతున్న పౌష్టికాహారం తింటున్నారా? లేదా? పరిశీలించి గర్భిణీ స్త్రీలకు ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడే తల్లీబిడ్డల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా బాల్యవివాహాలు నమోదు కాకూడదన్నారు. సమావేశంలో మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ అధికారి డి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి, అవసరం మేరకు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ మీటింగ్ నిర్వహించారు. స్వచ్ఛభారత్ మిషన్ పనులు, స్వచ్ఛతాహి సేవ -2025 కార్యక్రమాలు, జల జీవన్ మిషన్ పనులు, విలేజ్ వాటర్ అండ్ శానిటేషన్ కమిటీ సభ్యుల చొరవ, తదితర అంశాలపై సమీక్షించారు.

ములపర్రు సర్పంచ్ చెక్ పవర్ రద్దు

పెనుగొండ: ములపర్రు సర్పంచ్ చెక్ పవరు రద్దు కేస్తూ డీపీఓ రామ్‌నాథ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పంచాయతీపై అవినీతి ఆరోపణ నేపథ్యంలో విచారణ నిర్వహించారు. అవినీతి జరిగినట్లు గుర్తించడంతో గ్రామ కార్యదర్శులుగా విధులు నిర్వహించిన నలుగురుకు నోటీసులు జారీచేస్తూ, సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేస్తున్నట్లు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తమ్మిలేరుకు వరద



నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేసిన వరద నీరు

చింతలపూడి: పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తోడు ఖమ్మం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు తమ్మిలేరు రిజర్వాయర్‌కు వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. జలాశయం నుంచి 1,072 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. భారీ వర్షాలకు ఎగువ ఖమ్మం జిల్లా నుంచి తమ్మిలేరుకు వరద నీరు చేరుతోంది. తమ్మిలేరు ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 348.60 అడుగులకు చేరుకుందని, గోనెలవాగు నీటి మట్టం 348.27 అడుగులకు చేరుకున్నట్లు తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ లాజర్‌బాబు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 3 టీఎంసీలు కాగా 1.883 టీఎంసీలకు చేరుకున్నట్లు చెప్పారు.



బాలాత్రిపుర సుందరీదేవిగా మావుళ్లమ్మ



ద్వారకాతిరుమలలో గాయత్రీ దేవిగా కుంకుళ్లమ్మ



గాయత్రీ దేవిగా జంగారెడ్డిగూడెం నూకాలమ్మ



పెనుగొండలో రాజరాజేశ్వరి దేవిగా



గూడెంలో గాయత్రిదేవిగా బలుసులమ్మ

వేదమాత గాయత్రీదేవిగా..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు అమ్మవారు గాయత్రీదేవిగా, రాజరాజేశ్వరిగా, బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్

ఆదిలోనే అవమానం

ఉపాధ్యాయ ఉద్యోగాలకు నియామక పత్రాల పంపిణీని కూటమి ప్రభుత్వం ప్రహసనంగా మార్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం చేసిన మెగా డీఎస్సీ నిర్వహణ, ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియకు కూటమి ప్రభుత్వం దాదాపు ఏడాదిన్నర సమయం తీసుకుంది. పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించిన గురువులకు ఆదిలోనే అవమానం జరిగిందని ఎంపికైన అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. గతంలో జరిగిన డీఎస్సీల్లో ఎంపికైన వారికి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి మాత్రమే నియామక పత్రాలు అందచేసేవారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎంపికైన దాదాపు 16 వేల మంది గురువులను అమరావతికి పిలిచి నియామకపత్రాలు ఇవ్వాలనుకోవడం ఇబ్బందికరంగా మారింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాతిపదికన నిర్వహించిన డీఎస్సీలో జిల్లా నుంచి 1063 మంది ఎంపికయ్యారు.

- నియామక పత్రాల అందజేతకు కొత్తగా ఎంపికైన టీచర్లకు పిలుపు
- ఎవరి దుప్పట్లు వాళ్లే తెచ్చుకోవాలని సూచన
- మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయలేరా ? అని ప్రశ్నిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- ఏలూరులోని 11 పాఠశాలల్లో పడక ఏర్పాట్లు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఎస్సీలో ఎంపికైన వారిలో అటు కుకునూరు, వేలేరుపాడు, ఇటు నరసాపురం, పాలకొల్లు తదితర ప్రాంతాలకు చెందిన వారు కూడా ఉన్నారు. అమరావతిలో ఈ నెల 25న వీరందరికీ నియామకపత్రాలు అందించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికోసం వీరందరినీ ముందు రోజు అంటే ఈ నెల 24నే ఏలూరుకు చేరుకోవాలని, అక్కడి నుంచి అమరావతి తీసుకు వెళ్తామని జిల్లా విద్యాశాఖాధికారి నుంచి సమాచారం పంపించారు. కుకునూరు, వేలేరుపాడు, నరసాపురం, పాలకొల్లు వంటి ప్రాంతాల నుంచి ఏలూరు చేరుకోవడానికి దాదాపు మూడు గంటలకు పైనే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఎంపికైన వీరిలో కొంతమంది గర్భిణులు, మరికొంత మంది చంటి పిల్లల తల్లులు, ఇంకొందరు వికలాంగులు ఉన్నారు. వీరంతా అన్ని గంటల పాటు ప్రయాణం చేయడం కష్టంతో కూడుకున్న పని.

జిల్లాలో కొత్తగా ఎంపికైన వారు 1063

డీఎస్సీ–25లో జిల్లాలో 1074 ఖాళీలు ఉన్నట్టు గుర్తించి వాటి భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే 1063 మందిని మాత్రమే ఉద్యోగాలకు ఎంపిక చేశారు. మరో 11 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేరంటూ ఎంపిక చేయలేదు.

గతంలో ఎన్ని పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తే అన్ని పోస్టులనూ భర్తీ చేసేవారు. రిజర్వేషన్, రోస్టర్, మెరిట్ ప్రకారం అభ్యర్థి లేకపోతే ఆ తరువాత అర్హత ఉన్న వారిని ఆ పోస్టుకు ఎంపిక చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం సంబంధిత అర్హత లేకుంటే ఆ పోస్టును పక్కన పెట్టి మరో డీఎస్సీలో భర్తీ చేస్తామని చెప్పడాన్ని కూడా విద్యారంగ నిపుణులు తప్పుపడుతున్నారు.

ఎవరి దుప్పట్లు వాళ్లే తెచ్చుకోవాలట..

ఎంపికైన కొత్తవారిని అమరావతి తీసుకెళ్లడానికి ముందు రోజు సాయంత్రమే రిపోర్ట్ చేయమని విద్యాశాఖాధికారులు తెలిపారు. ఎంపికైన 1063 మందితో పాటు జోన్ -2లో ఎంపికైన మరో 83 మంది కూడా ఏలూరులోనే రిపోర్ట్ చేయాలని తెలపడంతో వారందరికీ బస ఏర్పాటు ఇబ్బందికరంగా మారుతుందంటున్నారు. ఎంపికైన వారితో పాటు వారి కూడా మరొకరిని తీసుకురావాలని ఆదేశాలు అందాయి. ఈ మేరకు అమరావతికి తీసుకు వెళ్ళే వారి సంఖ్య 2300 మంది అవుతున్నారు. ఇంతమందికీ ఏలూరులో 10 ప్రభుత్వ పాఠశాలల్లో బస ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో వీరికి పడుకోవడానికి పరుపులు ఏర్పాటు చేస్తున్నామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ఈ బసకు వచ్చే వారంతా వారి వ్యక్తిగత మెడికల్ సామగ్రి తెచ్చుకోవాలని, ఎవరి బెడ్‌షీట్ వారే తెచ్చుకోవాలని, తలదిండు, మంచినీటి బాటిల్, గొడుగు, రెయిన్ కోటు, అభ్యర్థితో పాటు వచ్చే వారు కూడా వారి గుర్తింపు కార్డు తెచ్చుకోవాలనడం విడ్డూరంగా ఉందంటున్నారు. బసకు వచ్చే వారికి కనీసం మంచినీళ్ళు కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందా? అంటూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

ఇబ్బంది పెట్టడం ఎంతవరకూ సమంజసం

రాష్ట్రంలోని దాదాపు 16 వేల మందిని ఒకే చోటకు చేర్చి నియామకపత్రాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం హాస్యాస్పదం. గతంలో ఎప్పుడూ ఇలా చూడలేదు. ఎంపికైన ఉపాధ్యాయుల్లో కొంతమంది గర్భిణులు, చంటిపిల్లల తల్లులు ఉంటారు. అలాగే వికలాంగులు కూడా ఈ పోస్టులకు ఎంపికయ్యారు. వారిని ఒక రోజు ముందుగా ఏలూరుకు రమ్మనడం, మరునటి రోజు అమరావతికి తీసుకువెళతామని ఇబ్బంది పెట్టడం ఎంత వరకూ సమంజసం.

– గుగ్గులోతు కృష్ణ,
ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అకడమిక్ కన్వీనర్

నగరంలోని 11 పాఠశాలల్లో పడక ఏర్పాట్లు

జిల్లా వ్యాప్తంగా ఎంపికైన ఉపాధ్యాయులకు నగరంలోని 11 ప్రభుత్వ పాఠశాలల్లో బస ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో సౌకర్యాలు ఎలా ఉంటాయో అందరికీ తెలిసిందే. పాఠశాలల తరగతి గదుల్లోనే వారికి పడకల కోసం పరుపులు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్క తరగతి గదిలో 20 మందికి పడక ఏర్పాట్లు చేస్తున్నారు. తరగతి గదుల్లో దోమలతో ఎలా పాట్లు పడాలో అంటూ అభ్యర్థులు ఇప్పటి నుంచే ఆందోళన చెందుతున్నారు. కస్తూర్బా స్కూల్‌లో 20 గదుల్లో 300 మందికి, సుబ్బమ్మదేవి స్కూల్‌లో 12 గదుల్లో 240 మందికి, గాంధీనగర్ నగరపాలక సంస్థ హైస్కూల్‌లో 10 గదుల్లో 200 మందికి బస ఏర్పాటు చేశారు. సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్‌లో 15 గదుల్లో 300 మందికి, పోలీస్ స్కూల్ ఆడిటోరియంలో 100 మందికి, సెయింట్ గ్జేవియర్ స్కూల్‌లో 20 గదుల్లో 300 మందికి, సెయింట్ ఆన్స్ బాలికోన్నత పాఠశాలలో 20 గదుల్లో 300 మందికి ఏర్పాటు చేశారు. వీటితో పాటు శనివారపు పేట హైస్కూల్‌లో 15 గదుల్లో 300 మందికి, వట్లూరు సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో 20 గదుల్లో 400 మందికి, అమీనాపేట సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో 10 గదుల్లో 150 మందికి, బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో 10 రూముల్లో 150 మందికి ఏర్పాటు చేశారు.

దసరా ఉత్సవాల పేరుతో దోపిడీ

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: దసరా ఉత్సవాల పేరుతో ఇంద్రకీలాద్రి కనకదుర్గ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులను దోచుకొనేందుకు దేవుడి భూముల్లో అమ్యూజ్‌మెంట్ పార్కులు, క్లబ్‌లు ఏర్పాటు చేయడం దారుణమని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు. తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ.. విజయవాడలోని కమిషనరేట్ ఎదురుగా ఉన్న గొడుగు వెంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములను టీడీపీ నాయకులు, ఆ పార్టీ అధ్యక్షుడు దోచుకొనేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకొనేందుకు వస్తున్న భక్తులకు హిందూ ధర్మ ఆధ్యాత్మిక శోభను తెలియజేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉండగా అమ్యూజ్‌మెంట్ పార్కులు, క్లబ్‌లు వంటివి ఏర్పాటు చేసి భక్తుల జేబులు దోచుకోవడానికి టీడీపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఉర్సా పేరు మీద రూ.వేల కోట్ల విలువైన భూములు కొట్టేసిన ఎంపీ కేశినేని చిన్ని దోపిడీ కార్యక్రమాల ఏర్పాటుకు సిద్ధం చేయడం దారుణమన్నారు. వల్లమూడి గొడుగు వెంకటేశ్వరస్వామి దేవస్థానం భూములపై ఆయన కన్ను వేశాడని విమర్శించారు. స్వామి వారి భూముల్లో గతంలో కలెక్టరేట్ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుకు వీలులేదని.. దైవ కార్యక్రమాలు చేయడానికే వినియోగించాలని చర్యలు తీసుకున్నామని చెప్పారు. గొడుగు వెంకటేశ్వరస్వామి వారి భూముల విలువ సుమారు రూ.800 కోట్ల నుంచి రూ.1000 కోట్లు ఉంటుందన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు కృషి చేశామని గుర్తు చేశారు. 99 పైసలకు రూ.వేల కోట్ల విలువైన ఆస్తిని కొట్టేయడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. హైకోర్టు తీవ్రంగా ఖండించి దేవుడికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించాలని ఇతర కార్యక్రమాలు నిర్వహించవద్దని ఆదేశాలిచ్చిందని చెప్పారు. విజయవాడ ఉత్సవ్ పేరుతో భక్తుల మనోభావాలు దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారన్నారు. భక్తుడు హుండీలో వేసిన మరకతం కనిపించడం లేదని, మరో కొత్త డ్రామాకు కూటమి ప్రభుత్వం తెరలేపిందన్నారు. తాము అధికారంలో ఉండగా అమ్మవారి దర్శనం వేగంగా చేసుకునేందుకు రూ.500, రూ.300, రూ.100, ఉచితంగా ఒక క్యూలైను మొత్తం నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ.500 క్యూలైనును రద్దు చేసి పెద్ద మనుషులకు ఉచితంగా ప్రత్యేక క్యూలైను ఉంచడం సబబు కాదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు తాతా శ్రీనివాస్, ముప్పిడి సంపత్‌కుమార్, కనుపూరి భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా సంకు



సంకు సూర్యనారాయణ

తణుకు అర్బన్: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రిఫరీగా తణుకు మండలం మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్య నారాయణ ఎంపికయ్యారు. మంగళవారం నుంచి 25 వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగుతున్న 36వ సౌత్ జోన్ జాతీయ స్థాయి పోటీలకు సూర్యనారాయణను నియమిస్తూ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిరసిస్తూ ర్యాలీ



భీమవరం నుంచి దగ్గులూరుకు బైక్ ర్యాలీగా వెళుతున్న దృశ్యం

భీమవరం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం భీమవరం అంబేడ్కర్ సెంటర్ నుంచి పాలకొల్లు మండలం దగ్గులూరులో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మెడికల్ కాలేజీని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని ప్రైవేటుకు అప్పగిస్తే ఉద్యమం తప్పదన్నారు. ర్యాలీలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, సంచార జాతుల వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్ర వీరన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్‌రావు, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకుడు లంకా కృష్ణమూర్తి, ఎంసీపీఐయూ నాయకుడు కె.మహంకాళి, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈద శేఖర్‌బాబు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్, ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తె రాజ్‌కుమార్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అధ్యక్షుడు సూడదాసు గంగయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, ఐలు జిల్లా నాయకుడు రామాని కాస్ట్రో, మల్లుల శ్రీనివాస్, రిటైర్డ్ మెడికల్ అండ్ హెల్త్ అధికారి బిఎస్ఎస్ ప్రసాద్, రిటైర్డ్ ఎమ్మార్వో బి.ప్రసాద్, ఏపీ బహుజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బి.రమేష్, తదితరులు పాల్గొన్నారు

ఆయాలకు అందని జీతాలు

- జిల్లాలో 1,440 మంది ఆయాల నియామకం
- ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేస్తున్నా నెలకు రూ. 6 వేలే జీతం
- ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేస్తేనే జీతాలు



ప్రభుత్వ పాఠశాలలో సుందరంగా ఉన్న మరుగుదొడ్లు

భీమవరం: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా గత ప్రభుత్వం మనబడి నాడు–నేడు పథకంలో అభివృద్ధి చేయడమేగాక విద్యార్థులకు పూర్తిస్థాయిలో మరుగుదొడ్ల సౌకర్యం కల్పించింది. వాటి నిర్వహణకు ప్రత్యేకంగా ఆయాలను నియమించి ప్రతి రోజు నాలుగు సార్లు మరుగుదొడ్లు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవడమేగాక వాటికి అవసరమైన మెటీరియల్ ప్రభుత్వం పంపిణీ చేసింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో పాఠశాల విద్యార్థినులకు మరుగుదొడ్లు ఇబ్బంది తీరింది. వాటిని శుభ్రంచేసే పనితో అనేకమందికి ఉపాధి లభించింది. ఆయాలకు అప్పటి ప్రభుత్వం నెలకు రూ.6 వేల జీతమే నేటి కూటమి ప్రభుత్వం ఇవ్వడంతో పెరిగిన ధరలతో కుటుంబం గడవడం ఇబ్బందిగా ఉందని ఆయాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సుమారు 1,440 మంది ఆయాలు

గత ప్రభుత్వం స్కూల్స్‌లో సకల సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేసింది. జిల్లాలోని సుమారు 1,360 జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో 1,440 మంది ఆయాలు, దాదాపు 100 మంది నైట్‌వాచ్‌మెన్‌లను నియమించింది. నెలకు రూ.6 వేల జీతం నిర్ణయించింది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 300 కంటే తక్కువగా ఉంటే ఒకరు, 600 వరకు ఇద్దరు, 600కు పైగా విద్యార్థులున్న పాఠశాలకు ముగ్గురు ఆయాలను నియమించారు. ఆయాలు ప్రతి రోజు నాలుగు సార్లు మరుగుదొడ్లు శుభ్రం చేయడంతోపాటు, పాఠశాల గదులు, ఆవరణ శుభ్రం చేయాల్సివుంటుంది.

సక్రమంగా అందని జీతాలు : తక్కువ మొత్తంలో జీతాలు ఇస్తున్న ప్రభుత్వం మూడు, నాలుగు నెలలకు ఒకసారి జీతాలు ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం టాయిలెట్స్ మెయింటినెన్స్ ఫండ్(టీఎంఎఫ్) అప్పుడప్పుడు విడుదల చేయడం వల్ల సక్రమంగా జీతాలు అందడం లేదు. మరుగుదొడ్లు శుభ్రం చేసేందుకు కెమికల్స్ వినియోగించడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము చేసే పనిని దృష్టిలో పెట్టుకుని నెలకు రూ. 15 జీతం, ఈఎస్ఐ, పీఎఫ్, మెడికల్ అలవెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆట్యా పాట్యా జిల్లా సీనియర్ జట్టు ఎంపిక



ఆట్యా-పాట్యా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

భీమవరం: పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం హైస్కూల్ ఆవరణలో మంగళవారం ఆట్యా-పాట్యా జిల్లాస్థాయి సీనియర్ పురుషుల జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టులో డి ప్రసాద్, ఎం ఆదిత్య, డి సాయికృష్ణ, బి సతీష్, ఆర్.యేసు, జె.లోకేష్, డి.మోహన్‌కుమార్, బి.శిలువరాజ్, జి.యశ్వంత్‌రమణ, పి.గోపీకృష్ణ ఉన్నారని ఆట్యా-పాట్యా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన రామచంద్రరాజు, జి కిరణ్‌వర్మ తెలిపారు. ఎంపికైన జట్టు పల్నాడు జిల్లా నకిరేకల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఆట్యా-పాట్యా చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. జట్టు ఎంపికలో పర్యవేక్షకునిగా స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ జీపీసీ శేఖర్‌రాజు, డీవీ రామభద్రరాజు వ్యవహరించారు.

ఎస్‌ఆర్‌కేఆర్‌కు మూడు జాతీయస్థాయి అవార్డులు



అవార్డులు అందుకుంటున్న మురళీకృష్ణంరాజు, జగపతిరాజు, రవికిరణ్‌వర్మ

భీమవరం: ఏఐసీటీఈ, ఎడు స్కిల్స్ ఇటీవల సిమ్లాలో అకాడమియా, ఇండస్ట్రీ ప్రతినిధులతో నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మూడు జాతీయస్థాయి అవార్డులు అందుకుందని కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు మంగళవారం చెప్పారు. విద్యార్థులను అత్యధిక ఇంటర్న్‌షిప్‌లతో ప్రోత్సహించడం వంటి వాటిలో మంచి ప్రతిభ సాధించిన కళాశాలకు అవార్డులు ఇస్తారన్నారు. సదస్సులో తమ కళాశాలకు సౌత్ సెంట్రల్ జోన్ బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్ అవార్డు, జునిపార్ నెట్‌వర్క్ ఇంటర్న్‌షిప్‌లో ఎక్సలెన్స్ అవార్డు, విద్యార్థుల ఓటింగ్‌లలో ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారన్నారు. కార్యక్రమంలో జగపతిరాజు, కళాశాల ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్, ఎడు స్కిల్స్ కోఆర్డినేటర్ పి రవికిరణ్‌వర్మ పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి మృతి


పెదవేగి : మద్యానికి బానిసైన వ్యక్తి మనస్తాపంతో పురుగుల మందు తాగి మృతి చెందాడు. ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూచింపూడి గ్రామానికి చెందిన కొమ్మిన శ్రీనివాసరావు (45) మద్యానికి బానిస కావడంతో అతనికి, భార్య లక్ష్మికి మధ్య కొంతకాలంగా స్వల్ప తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 20న భార్య లక్ష్మి మందలించడంతో మధ్యాహ్నం 3 గంటల సమయంలో శ్రీనివాసరావు బయటకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి విషయం చెప్పాడు. స్థానికుల సాయంతో లక్ష్మి భర్తను ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించింది. చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ చెప్పారు.

అప్పులు తీర్చలేక..

భీమడోలు: అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి పురుగు మందు తాగి మృతి చెందిన ఘటన మంగళవారం అంబర్‌పేట పంచాయతీ శివారు కొండ్రెడ్డినగర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ శృంగవృక్షం నాగరాజు(37) లారీకి ఫైనాన్స్‌పై అప్పులు తీసుకున్నాడు. వాటితో పాటు ఇతర అప్పులు చేయడంతో తీర్చలేక తన ఇంట్లో పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆతడ్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగరాజుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పురోగతి లేని బందరు రైల్వే లైన్!

- కొత్త లైన్ సర్వేకు గతేడాది ఆగస్టులో గ్రీన్ సిగ్నల్
- ఏడాది దాటినా రెడీ కాని డీపీఆర్
- ఈ ఏడాది బడ్జెట్‌లో కూడా కేటాయింపులు నిల్
- నిరాశలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల వాసులు



నరసాపురం-మచిలీపట్నం మధ్య నిర్మించనున్న రైల్వే లైన్ మ్యాప్



నరసాపురం రైల్వే స్టేషన్

నరసాపురం: నరసాపురం - మచిలీపట్నం మధ్య 67 కిలోమీటర్లు మేర కొత్తగా రైల్వే లైన్ నిర్మిస్తున్నట్టు గతేడాది కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ కొత్త రైల్వే లైన్ నిర్మాణం కోసం 2024-25 రైల్వే బడ్జెట్‌లో ఆమోదం తెలపడంతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల వాసులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఈ రైల్వేలైన్ నిర్మాణం విషయంలో ఏడాది గడిచినా ఎలాంటి పురోగతి లేదు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఇంకా డీపీఆర్ పనులు సిద్ధం చేయనేలేదు. ఇటీవల నరసాపురం వచ్చిన రైల్వే విజయవాడ డివిజన్ డీఆర్‌ఎం ఈ ప్రాజెక్ట్ అంశంలో స్పష్టత ఇచ్చారు. నరసాపురం - మచిలీపట్నం కొత్త రైల్వే లైన్ నిర్మాణంపై డీపీఆర్ రెడీ కాలేదని చెప్పారు. ఇదీకాక 2024-25 రైల్వే బడ్జెట్‌లో కొత్త రైల్వేలైన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది 2025 - 26 రైల్వే బడ్జెట్‌లో ఈ రైల్వే లైన్ అంశాన్ని పరిగణనలోకి తీసుకోనేలేదు. ఒక్కపైసా కూడా నిధులు కేటాయించలేదు. దీంతో ప్రజలను ఎంతో ఊరించిన ఈ ప్రాజెక్ట్ భవితవ్యం ఎలా ఉండబోతుందనే దానిపై చర్చ సాగుతోంది.

దశాబ్దాల డిమాండ్

ఎప్పుడో బ్రిటీష్ హయాంలో 1929లో నరసాపురం వరకూ రైల్వే ట్రాక్ విస్తరణ జరిగింది. అప్పటిలోనే నరసాపురం నుంచి మచిలీపట్నం వరకూ రైల్వే లైన్‌ను పొడిగించాలని భావించింది. ఇటు నరసాపురం, అటు మచిలీపట్నం రెండూ కూడా సముద్ర తీర పట్టణాలు కావడం, జలరవాణా ప్రధానంగా ఉండే ఆ రోజుల్లో ఈ రెండు పట్టణాలు కూడా బ్రిటీష్ పాలనా వ్యవహారాల్లో కీలకంగా ఉండటంతో రెండిటికీ అనుసంధానంగా రైల్వే రవాణా సదుపాయం ఉండాలని భావించింది. కానీ అది కార్యరూపం దాల్చలేదు. 2024-25 రైల్వే బడ్జెట్‌లో నరసాపురం - మచిలీపట్నం మధ్య 67 కిలోమీటర్లు మేర కొత్త రైల్వే నిర్మాణం చేయడానికి సర్వే పనులకు ఆమోదం లభించడంతో దశాబ్దాల తరువాత ఆశలు చిగురించాయి. కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి ఎంత వ్యయం అవుతుంది, ఎంతకాలం పడుతుంది, ఎంతమేర భూసేకరణ చేయాలనే అంశాలతో డీపీఆర్ రెడీ చేయాలి. అయితే ఏడాది దాటినా ఈ అంశంపై ఉలుకూ పలుకూ లేదు.

టెర్మినల్ స్టేషన్‌గా రూపాంతరం!

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కోటిపల్లి - నరసాపురం రైల్వే నిర్మాణ పనులు ఓ పక్క సాగుతున్నాయి. రూ 28 వేల కోట్ల అంచనాతో ప్రారంభమైన కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ నిర్మాణానికి గత 6 ఏళ్ల నుంచి ప్రతి బడ్జెట్‌లో కేంద్రం నిధులు కేటాయిస్తుంది. ఇప్పటికీ ఈ ప్రాజెక్ట్ కోసం రూ.1,450 కోట్లు కేటాయించింది. గోదావరిపై 3 చోట్ల రూ.700 కోట్లలో వంతెనల నిర్మాణాలు సాగుతున్నాయి. కోటిపల్లి టు నరసాపురం రైల్వేలైన్ నిర్మాణం పూర్తయితే అటు కోనసీమ నుంచి ఇటు కోస్తాకు రైల్వే ప్రయాణం అందుబాటులోకి వస్తుంది. అలాగే నరసాపురం - మచిలీపట్నం రైల్వే లైన్ నిర్మాణం కూడా పూర్తయితే మొత్తం గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలకు అనుసంధానంగా నాలుగు వైపుల నుంచి అతిపెద్ద రైల్వే రవాణా వ్యవస్థ ఏర్పడుతుంది. గోదావరి జిల్లాలలోనే అతిపెద్ద టెర్మినల్ స్టేషన్‌గా నరసాపురం రూపాంతరం చెందుతుంది. ఇప్పటికే రైల్వే కోచ్‌లను కడగడం లాంటి మెయింట్‌నెన్స్ సెంటర్ విజయవాడ తరువాత నరసాపురంలోనే ఉంది. నరసాపురం - విజయవాడ మధ్య డబుల్ లైన్ రెండేళ్ల క్రితం నుంచి అందుబాటులోకి రావడంతో ట్రాఫిక్ సమస్య తీరి ఈ రూట్‌లో కొత్త రైళ్ల సంఖ్య పెరిగింది. అన్నీ అనుకూలించి నరసాపురం, మచిలీపట్నం మధ్య కూడా రైళ్లు పరిగెడితే అభివృద్ధి పరంగా పరిస్థితి వేరుగా ఉంటుంది. మరి ఇంత ప్రాధాన్యం ఉన్న ఈ ప్రాజెక్ట్ విషయంలో గోదావరి జిల్లాలో అన్ని పార్లమెంట్ స్థానాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కూటమి ఎంపీలు నోరు మెదపకపోవడం విమర్శలకు తావిస్తోంది.

గ్రేడ్-1 వీఆర్‌వోలకు పదోన్నతులు కల్పించాలి



కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-1 వీఆర్‌వోలకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతులు కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు మంగళవారం కలక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ గ్రేడ్-1, వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లు రెండేళ్ల నుంచి ఇవ్వడం లేదన్నారు. దీని వల్ల వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రమోషన్ల విషయంలో ఇప్పటికే అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. వెంటనే ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులు అర్హులైన గ్రేడ్ 1, వీఆర్వోలతో భర్తీ చేయాలని ఆయన కోరారు. అలాగే గ్రేడు-2 వీఆర్‌ఓలకు ప్రొబేషన్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాలో సర్వే ఎగ్జామ్స్, సీపీటీ పాసైనవారికి వెంటనే ప్రొబేషన్ డిక్లేర్ చేయాలన్నారు. గ్రేడ్-2 వీఆర్‌వోలకు గ్రేడ్ 1 ప్రమోషన్లు కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ వెంటనే వీఆర్‌వోలకు ప్రమోషన్ల విషయంలో ఫైల్ పెట్టాలని అధికారులను ఆదేశించినట్లు రవీంద్రరాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ, ఏలూరు జిల్లా కోశాధికారి రవికుమార్, కొవ్వూరు డివిజన్ అధ్యక్షుడు ఏ ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- గొల్ల చెరువులో నీట మునిగి బాలుడి మృతి
- తిరుమలంపాలెంలో ఘటన



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ద్వారకాతిరుమల: ఈత సరదా ఒక బాలుడి ప్రాణాలు తీసింది. తన స్నేహితులతో కలసి చెరువులో ఉత్సాహంగా ఈత కొడుతున్న ఆ బాలుడు ఒక్కసారిగా నీట మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన మండలంలోని తిరుమలంపాలెంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన ముద్దే రాజు (14) తిరుమలంపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో తన నలుగురు స్నేహితులతో కలసి మధ్యాహ్నం రాజు గ్రామంలోని గొల్ల చెరువులో ఈతకు వెళ్లాడు. సరదాగా.. కేరింతలు కొడుతూ వారు చెరువులో ఆడుతున్నారు. అయితే అటుగా వెళ్లిన గండికోట సుబ్బారావు అనే యువకుడు చెరువులో ఆటలేమిటని వారిపై కేకలు వేశారు. దాంతో అక్కడి నుంచి పరుగులు తీసిన నలుగురు బాలురలో, ఒక బాలుడు రాజు చెరువులోని గుంతలో మునిగిపోయాడని చెప్పి పారిపోయాడు. దాంతో సుబ్బారావు వెంటనే చెరువులోకి దిగి రాజును బయటకు తీశాడు. అయితే అప్పటికే అతడు మృతి చెందాడు. ఘటనా స్థలంలో రాజు తండ్రి సత్యన్నారాయణ, కుటుంబ సభ్యులు పెట్టిన రోదనలు మిన్నంటాయి. ఇదిలా ఉంటే చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు కారణంగా ఏర్పడ్డ పెద్ద గుంతలో పడి రాజు మృతి చెందాడని స్థానికులు చెబుతున్నారు. సకాలంలో సుబ్బారావు వెళ్లకపోతే మిగిలిన పిల్లలు కూడా నీట మునిగేవారని అంటున్నారు.

రహదారి అధ్వానంపై మహిళల ఆందోళన



పొంగుటూరులో ఆందోళన చేస్తున్న స్థానికులు

కొయ్యలగూడెం: పొంగుటూరు-యర్నగూడెం గ్రామాల మధ్య రహదారి అధ్వానంగా ఉండడంపై పొంగుటూరులో మహిళలు మంగళవారం ఆందోళన చేపట్టారు. అధ్వానంగా ఉన్న గోతుల వద్ద నిరసన వ్యక్తం చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న వాహనాల వలన వేసిన కొద్ది రోజులకే రోడ్డు పాడైపోయిందని అన్నారు. రోడ్డు బాగోకపోవడంతో ఆటోలు సైతం రావడం లేదని, దీంతో తామంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. స్కూళ్లకు విద్యార్థులు సకాలంలో చేరలేకపోతున్నారని వాపోయారు. యాదవోలు మొదలుకొని పొంగుటూరు వరకు రోడ్డు మరీ అధ్వానంగా మారిందని వ్యవసాయ పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయని రైతులు పేర్కొన్నారు. కలెక్టర్ కలగజేసుకొని తక్షణమే రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేశారు. మహిళలు చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి పంచాయతీ పాలకమండలి, రైతు ప్రతినిధులు సంఘీభావం తెలిపారు.


మామిడిలో సస్య రక్షణ చర్యలు



మెట్ట ప్రాంతంలో విస్తరించిన మామిడి తోటలు



ఎండీ షాఫియ ఫర్‌హీన్ ఉద్యానశాఖ అధికారిణి



చింతలపూడి: రాష్ట్రంలో మామిడి తోటలు సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో పూతకు వస్తాయి. ఈ దశలో మామిడి రైతులు ఇప్పటి నుండే సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఒక పక్క మామిడి తోటల పునరుద్ధరణపై దృష్టి సారిస్తూనే మరో పక్క సస్యరక్షణపై ఉద్యాన అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, చింతలపూడి, లింగపాలెం, ద్వారకా తిరుమల, నల్లజర్ల, టి నరసాపురం ప్రాంతాల్లో సుమారు 60 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ప్రతి ఏటా నాణ్యమైన పంట దిగుబడిని గణనీయంగా పెంచడానికి ఉద్యానాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చునని ఉద్యాన శాఖ అధికారిణి ఎండీ షాఫియ ఫర్‌హీన్ తెలియజేస్తున్నారు. పూత రావడానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచిస్తున్నారు.

పూత వచ్చే దశలో...

మామిడి రైతులు సెప్టెంబర్ నెల నుంచే తోటల్లో దుక్కులు దున్నుకోవాలి. చెట్లకు కావాల్సిన ఎరువులను వేసుకోవాలి. అక్టోబర్ తరువాత మామిడి తోటలను దున్న కూడదు. ఈ దశలో దున్నితే చెట్ల వేర్లు కదిలి పోషక పదార్థాల సమతుల్యత దెబ్బ తింటుంది. సాధారణంగా మామిడిలో పూత ఒకే సారి రాదు. ఫిబ్రవరి నెలాఖరు వరకు పూత వస్తూనే ఉంటుంది. ఈ సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం రైతులకు కష్టం. ఈ సమస్యను అధిగమించేందుకు తేమ తక్కువ ఉండే నేలల్లో తేలికపాటి నీటి తడులు ఇవ్వాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

తోటల్లో సూక్ష్మ పోషక లోపాలను నివారించడానికి లీటరు నీటికి 5 గ్రాముల జింక్ సల్ఫేట్, 3 గ్రాముల బోరాక్స్, 5 గ్రాముల ఫెర్రిక్ సల్ఫేట్, 10 గ్రాముల యూరియా కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. వర్షం పడితే రసం పీల్చే పురుగులు చేరే అవకాశం ఉండటం కారణంగా తోటల్లో కలుపు లేకుండా చూసుకోవాలి. తోటల్లో పూత, మొగ్గలు ప్రారంభమైన తరువాత మొగ్గలు విచ్చుకుని పూత రావడానికి 2 గ్రాముల బోరాన్ లేదా, 10 గ్రాముల మల్టీ-కేతో పాటు 5 గ్రాముల ఫార్ముల -4 మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తేనె మంచు పురుగు నివారణ

తేనె మంచు పురుగులు తల్లి, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులను, పూత కాండాలను, లేత పిందెల నుంచి రసం పీల్చి నష్టం చేస్తాయి. దీని వల్ల ఆకుల చివర్లు మాడిపోతాయి. దీంతో పూత మాడిపోతుంది. పిందెలు బలహీన పడి రాలి పోతాయి. అంతే కాకుండా ఈ పురుగులు విసర్జించే పదార్థం వల్ల ఆకులు, కాయలపై మసి పొర ఏర్పడుతుంది. పూత, పిందె దశలో ఈ పురుగుల ఉధృతి అధికంగా ఉంటుంది. మిగతా సమయాల్లో ఈ పురుగులు చెట్టు మొదలు, కొమ్మల బెరడుల్లోని పగుళ్లలో ఉంటాయి.

నివారణ

వీటి నివారణకు 1.5 మి.లీటర్ల మోనోక్రోటోఫాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పూత మొగ్గ దశలో లీటరు నీటికి 1 మి.లీటరు డైక్లోరోఫాస్ లేదా 3 గ్రాముల కార్బోరిల్ కలిపి చెట్టంతా తడిచేలా పిచికారీ చేయాలి. పచ్చ పూత దశలో, మొగ్గ దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి 2 మి.లీటర్ల మోనో క్రోటోఫాస్ లేదా డైమిథోయేట్, లేదా 3 మి.లీటర్ల మిథైల్ డెమాటాన్, లేదా 0.25 మి.లీటర్ల ఇమిడా క్లోప్రిడ్ పిచికారీ చేయాలి.

బూడిద రంగు తెగులు

మామిడి లేత ఆకులు, పూత కాండం, పూలమీద, చిరు పిందెల మీద తెల్లటి పౌడర్ లాంటి బూజు చేరుతుంది. దీన్నే బూజు తెగులు అంటారు. రాత్రుల్లు చల్లగా, పగలు వేడిగా ఉన్నప్పుడు ఇది ఆశిస్తుంది. దీని వల్ల పూత రాలి పోతుంది. దీని నివారణకు మొగ్గలు కనిపించే దశలో లీటరు నీటికి 3 గ్రాముల గంధకం కలిపి పిచికారీ చేయాలి. పూత దశలో తెగులు కనిపిస్తే హెక్సా కోనజోల్ 2 మి.లీటర్లు, లేదా ప్రొపికోనజోల్ 1 మి.లీటరు లేదా డినోకాఫ్, లేదా ట్రై డిమార్ఫ్ 1 మి.లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ సూచనలు పాటించడం వల్ల మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో సాయి ప్రకాష్ మృతదేహం

పెదపాడు: లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పెదపాడు మండలంలోని కలపర్రు టోల్ గేట్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండవల్లి మండలంలోని ఇంగిలిపాకలంక గ్రామానికి చెందిన ఘంటసాల నాగరాజు కుమారుడు సాయి ప్రకాష్ (23) విజయవాడలోని గ్రీన్‌లేక్ డాటా సిస్టమ్స్‌లో ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 21న పుట్టినరోజు కావడంతో ఇంటికి వచ్చాడు. తిరిగి విజయవాడకు మంగళవారం ఉదయం 7.30 గంటలకు తన మోటారు సైకిల్‌పై బయలు దేరాడు. కలపర్రు టోల్‌గేట్ వద్దకు వచ్చేసరికి వెనుక వస్తున్న లారీ ఢీకొట్టడంతో అతడు లారీ కిందపడి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. సమీప బంధువు మోరు వెంకట శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పెదపాడు హెడ్ కానిస్టేబుల్ పీ వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భక్తురాలి పట్ల అసభ్య ప్రవర్తన

- దేవస్థానం అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి దేహశుద్ధి
- ఆపై అధికారులకు ఫిర్యాదు
- ఉద్యోగిని విధుల నుంచి తొలగించిన ఈఓ మూర్తి

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం టీటీడీ సదనంలో ఒక భక్తురాలి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉద్యోగికి భక్తురాలి కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేశారు. ఆపై అధికారులకు ఫిర్యాదు చేయగా, సదరు ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే. విశాఖపట్నంకు చెందిన ఒక భక్తుడి కుటుంబం (15 మంది) స్వామివారి దర్శనార్థం సోమవారం సాయంత్రం క్షేత్రానికి విచ్చేశారు. శ్రీవారి దర్శనానంతరం వారు మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రాన్ని సందర్శించారు. తిరుగు ప్రయాణంలో స్థానిక టీటీడీ సదనం వద్దకు చేరుకుని గదులు అద్దెకు తీసుకున్నారు. ఆ సమయంలో అక్కడ గుమస్తాగా విధులు నిర్వర్తిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నారాయణ వారితో కలివిడిగా మాట్లాడాడు. అదే సమయంలో బాధిత భక్తురాలు జ్వరంతో బాధపడుతున్నట్టు తెలుసుకున్నాడు. కొద్ది సేపటి తరువాత గదిలోంచి బయటకు వచ్చిన ఆమెను ఏమ్మా.. ట్యాబ్లెట్ వేసుకున్నావా అని ఆరా తీశాడు. తిరిగి మంగళవారం తెల్లవారుజామున ఆమె కనబడగా ఏరా.. జ్వరం తగ్గిందా అని చేయి పట్టుకున్నాడు. దాంతో భక్తురాలి భర్త, కుటుంబ సభ్యులు కోపోద్రిక్తులై నారాయణపై దాడి చేశారు. అనంతరం స్వామివారి పాదుకా మండపం వద్ద ఉన్న సమాచార కేంద్రంలో బాధిత భక్తురాలు సదరు ఉద్యోగిపై ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై వెంటనే ఆలయ ఏఈఓ బినంపూడి రమణరాజు, సూపరింటెండెంట్ కోటగిరి కిషోర్ ప్రాథమిక విచారణ జరపగా, ఈఓ ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి నారాయణను ఉద్యోగం నుంచి తొలగించారు. కాగా సదరు ఉద్యోగి సుమారు పదేళ్ల నుంచి దేవస్థానంలో పనిచేస్తున్నాడని, ఇప్పటి వరకు అతడిపై ఒక్క ఫిర్యాదు కూడా లేదని, అందరితో కలివిడిగా ఉంటాడని తోటి ఉద్యోగులు చెబుతున్నారు. అలా అత్యుత్సాహంగా ప్రవర్తిస్తూ.. జ్వరం చూసేందుకు భక్తురాలి చెయ్యి పట్టుకుని, పరిస్థితిని ఇక్కడి దాకా తెచ్చుకున్నాడని అంటున్నారు. ఏది ఏమైనా ఈ ఘటనపై అధికారులు పూర్తిస్థాయి విచారణ జరపాల్సి ఉంది.

వృద్ధ దంపతులపై దుండగుల దాడి

బంగారు, వెండి వస్తువుల అపహరణ

జంగారెడ్డిగూడెం: లక్కవరంలో ఓ వృద్ధ దంపతుల ఇంట్లో దుండగులు ప్రవేశించి వృద్ధులపై దాడి చేసి, బంగారు, వెండి వస్తువులు దోచుకుపోయారు. వివరాల ప్రకారం గ్రామంలో వందనపు రుక్కయ్య, లక్ష్మీ అంజనీ కుమారి వృద్ధ దంపతులు జీవిస్తున్నారు. వీరి కుమారుడు, కుమార్తె అమెరికాలో ఉంటున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటాక సుమారు 2 గంటల సమయంలో వృద్ధ దంపతుల ఇంటిలోకి ముగ్గురు దుండగులు ప్రవేశించి వారిని కొట్టి, బెదిరించి అంజనీ కుమారి మెడలోను, ఒంటిపైన ఉన్న బంగారు వస్తువులను లాగేసుకున్నారు. అలాగే బీరువాల్లో ఉన్న వస్తువులను అపహరించి పరారయ్యారు. ఈ ముగ్గురి వయస్సు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని చెబుతున్నారు. దుండుగులు పారిపోయాక వృద్ధ దంపతులు కట్లు విప్పుకుని వారి బంధువులకు తెలియజేయగా దీంతో వెంటనే వారు లక్కవరం పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ యు.రవిచంద్ర, జంగారెడ్డిగూడెం సీఐ ఎం.సుభాష్, చింతలపూడి సీఐ క్రాంతి కుమార్, జంగారెడ్డిగూడెం, తడికలపూడి ఎస్సైలు షేక్ జబీర్, చెన్నారావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం డాగ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు చేశారు. పోలీసు జాగిలం ఇల్లంతా కలియతిరిగి జి.కొత్తపల్లి రోడ్డు వైపు వెళ్లింది. కాగా, క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలను సేకరించారు. చోరీకి గురైన బంగారు, వెండి వస్తువులు సుమారు రూ.8 లక్షల విలువ ఉంటుందని లక్కవరం ఏఎస్సై భాస్కర్ తెలిపారు. దీనిపై లక్ష్మీ అంజనీకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇదిలా ఉంటే చోరీకి గురైన బంగారం, వెండి వస్తువులు భారీ మొత్తంలోనే ఉన్నాయని తెలిసింది.

దూర విద్య ప్రవేశ ఫీజు చెల్లింపునకు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఫీజు చెల్లించడానికి గడువు తేదీని పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులు రూ. 200 అపరాధ రుసుముతో అక్టోబర్ 31వ తేదీ వరకూ ఫీజు చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని దూరవిద్యా విధానంలో ఆయా కోర్సుల్లో చేరే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిలకడగా గోదావరి వరద

పోలవరం రూరల్: గోదావరి వరద ప్రవాహం ఒకే విధంగా కొనసాగుతోంది. తగ్గుతూ, పెరుగుతూ గోదావరి వరద నిలకడగా ప్రవహిస్తోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 30 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి 4.84 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. ఎగువన భద్రాచలం వద్ద స్వల్పంగా వరద తగ్గినా మరలా పెరుగుతూ 29.40 అడుగులకు నీటి మట్టం చేరుకుంది.

క్లుప్తంగా

26 మంది వృద్ధులకు వైద్య సేవలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రమేష్ చంద్రబాబు

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సీనియర్ వైద్యులు భూపతిరాజు రమేష్ చంద్రబాబు 26 మంది వృద్ధులకు వైద్యసేవలు అందజేశారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన శిబిరంలో రోగులకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులు తీసుకోవాల్సిన ఆహార అలవాట్లు, వ్యాయామం, నడక వంటి విషయాలపై వైద్యులు అవగాహన కల్పించారు. పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు ద్వారంపూడి బాపిరెడ్డి, కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం



మాట్లాడుతున్న డి.సోమసుందర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక హక్కులను హరిస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ స్పష్టం చేశారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం స్థానిక సిపాయి పేటలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఓసూరి వీర్రాజు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు సరిగా చెల్లించడం లేదని వాపోయారు. బ్యాంకు సంఘం నాయకులు ఎస్ఎస్ ప్రసాద్, ఏపీ, తెలంగాణ బ్యాంక్ సంఘాల నాయకులు తోట సూర్యనారాయణ, అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అవసరం మేరకే ఎరువులు వాడాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ రమేష్

అత్తిలి: రైతులు అవసరం మేరకు మాత్రమే యూరియా వాడాలని మార్టేరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంవీ రమేష్ అన్నారు. మంగళవారం అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్ మాట్లాడుతూ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలమరశెట్టి నాగేశ్వరరావు, మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు వి శ్రీనివాసచారి, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు

పెనుగొండ: పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా పైపులైన్ల మరమ్మతులను పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి పర్యవేక్షించారు. మంగళవారం శివారు ప్రాంతాల కాలనీలకు తాగునీటి సరఫరాను అధికారులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సూర్యప్రకాశరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిరియాల శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య విధానంపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: ఆయుర్వేదం భారతీయ ప్రాచీన వైద్య విధానం మాత్రమే కాకుండా ప్రకృతిని కాపాడే సమగ్ర జీవన విధానమని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.యామిని అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయుర్వేద వైద్య విధానంపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యామిని మాట్లాడుతూ యువత ఆయుర్వేదంపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా పర్యావరణ పరిరక్షణలో కూడా సహకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలతో పాటు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుర్వేద మూలికల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, అధ్యాపకులు డాక్టర్ ఎం.రామకృష్ణ, డాక్టర్ బూసి వెంకటస్వామి, పి.శ్రీనివాసరావు, వి.శిరీష, కె.శివకృష్ణ, బి.రమేష్ కుమార్ కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రజారోగ్యం

- మురుగునీటితో పేరుకుపోతున్న కాలువలు
- విజృంభిస్తున్న దోమలు
- అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని యంత్రాంగం



వల్లూరుపల్లిలోని ఒక వీధిలో డ్రెయినేజీ దుస్థితి



రాచర్ల గ్రామంలో కలుషిత నీటితో ఉన్న సంపు

పెంటపాడు: గ్రామాల్లో ఉండాలన్నా, అడుగుపెట్టాలన్న ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామాల్లో ప్రజారోగ్యం ప్రమాదకరంగా కనిపిస్తోంది. వీధులు దుర్గంధభరితంగా ఉన్నాయని, వీధుల్లోకి రాలేకపోతున్నామని, కాలువల పక్కన నివాస గృహాల్లో నివసించలేకపోతున్నామని, అంటు రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఆర్భాటం చేయడమే తప్ప ఆచరణ ఎక్కడా కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. బేనర్లు పట్టి ఏదో మొక్కుబడిగా ర్యాలీ చేసి ఫొటోలకు ఫోజులిచ్చి అక్కడితో మమ అనిపించేస్తున్నారు. అంతేకాని పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించి వీధులు, కాలువలను పరిశుభ్రం చేయించిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. పెంటపాడు కునాకరపేట, కె.పెంటపాడు తూర్పు ఎస్సీ పేట, యానాలపల్లి, ఆకుతీగపాడులోని హరిజన పేట, ముదునూరు జగనన్న కాలనీ, జట్లపాలెం దళితవాడలో సమస్యలు తీవ్రంగా ఉన్నట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

స్వచ్ఛ సంకల్పానికి తిలోదకాలు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేర లేదు. ఇప్పుడు కొత్తగా స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛదివస్ పేరుతో చేపట్టే పారిశుద్ధ్య కార్యక్రమాలు సైతం ఎక్కడా కనిపించడంలేదు. చెత్త రహిత వార్డులు, గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. గ్రామాల్లో రోడ్లు, కాలువలు చెత్తాచెదారాలతో పేరుకుపోయి రోడ్లపైనే మురుగునీరు నిల్వతో పల్లె వీధులు అపరిశుభ్ర వాతావరణంలో తాండవిస్తున్నాయి. పారిశుద్ధ్య పనులు చేయించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలు దుర్వాసనతో సహవాసం చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. వీధికాలువలు మురుగునీటితో నిండిపోవడంతో దోమలు, ఈగలు లార్వాల సంతతికి నెలవుగా మారుతున్నాయి.

వ్యర్థాలన్నీ, రోడ్ల పక్కన, వీధి కాలువల్లోనే..

వ్యర్థాలన్నీ, గ్రామాల్లో వీధులు, కాలువల్లో కనిపిస్తున్నాయి. కాలువల్లో పూడికతీత సక్రమంగా చేపట్టకపోవడంతో మురుగునీరు పేరుకుపోతుంది. వీధి కాలువల నిర్మాణాలు సక్రమంగా లేకపోవడంతో నీరుపారేందుకు అవకాశాలు లేకుండా పోయాయి. వ్యర్థాలను రోడ్డుపక్కన పడవేయడంతో అవి చెల్లాచెదురై కాలువల్లోకి వచ్చి చేరుతున్నాయి. దీంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. పంచాయతీల పాలకులు రాజకీయ మొహమాటాలకు పోయి గ్రామాలను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలి



నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

తణుకు అర్బన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని ఫైలేరియా కేంద్రం ప్రాంతంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాల కోసం కార్మికులు ఎన్నో అనారోగ్యాలను లెక్క చేయకుండా పని చేస్తున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వకపోవడం వలన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గతంలో 17 రోజుల సమ్మె కాలంలో జరిగిన ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని, చనిపోయిన, రిటైర్మెంట్, అనారోగ్యంతో ఉన్న వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గార రంగారావు, అర్జి కృష్ణబాబు, రమేష్, అయ్యప్ప, అనంత లక్ష్మి, నీలాపు రవి, కాకి రమణ, కె.రాజమ్మ, రాంబాబు, వెంకటేశ్వరరావు, అరుణా దేవి, ఎస్.పద్మ, పి.జ్యోతిబాబు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష



అత్తిలి: కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి నాగరాజు



తాడేపల్లిగూడెం రూరల్: మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్

అత్తిలి: ఆరోగ్యవంతమైన మహిళ కుటుంబానికి రక్షణగా ఉంటుందని పీహెచ్‌సీ వైద్యాధికారి కె.నాగరాజు అన్నారు. అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అత్తిలి పెదపేటలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని కోరారు. చిన్నారులకు సరైన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడం ద్వారా వ్యాధుల నుంచి దూరం చేయొచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దాసం ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్ డి.ప్రమీల రాణి, భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ జేఎస్ గనిరాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల, మోదుగ గుంట, మాధవరం, కొమ్ముగూడెం గ్రామాల్లో మంగళవారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. పడాలలో ఏఎంసీ డైరెక్టర్ కామిశెట్టి శ్రీనివాస్, మాధవరంలో సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. శిబిరంలో 165 మందికి డాక్టర్ రూపాదేవి పరీక్షలు నిర్వహించారు. మాధవరంలో 283మందికి బీపీ, సుగర్, నోటి కేన్సర్, రొమ్ము, గర్భసంచి కేన్సర్ స్క్రీనింగ్, 46 మందికి టీబీ పరీక్షలను మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఏవీ.వెంకటేష్ నిర్వహించారు. మోదుగ గుంటలో 178మంది రోగులకు బీపీ, సుగర్, నోటి, రొమ్ము, గర్భసంచి, టీబీ పరీక్షలు చేశారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు నార్ని తాతాజీ, ఈతకోట తాతాజీ, అయినంపూడి శ్రీదేవి, సమయమంతుల కాశి, కొల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఇరగవరం: ఓపీ చూస్తున్న వైద్యులు

వైద్య శిబిరాలు ఉపయోగించుకోవాలి

ఇరగవరం: మండలంలోని రేలంగి పీహెచ్‌సీ రేలంగి శివారు గమ్మళ్లపాడులో ఇరగవరం పీహెచ్‌సీ పరిధిలో కంతేరు గ్రామాల్లో మంగళవారం పీహెచ్‌సీ వైద్యులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కంతేరులో 135 మంది, గమ్మళ్లపాడులో 108 మంది, రోగులను పరీక్షించి మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా రేలంగి, ఇరగవరం పీహెచ్‌సీ విజయ్‌కుమార్, వై.మౌనికా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో అక్టోబర్ 2వ తేదీ వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సీహెచ్ స్వరాజ్య లక్ష్మి, గుడిమెట్ల ఆదిలక్ష్మి, ఎంపీహెచ్‌వో ప్రసాద్, సీహెచ్‌వో ఎస్‌కే ఖాన్‌సాహెబ్, తులసీదేవి, ఎం.జయరాజు, ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, అంగన్ వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి, సత్తి సోమశేఖర్ రెడ్డి, ముప్పిడి నరసింహమూర్తి, పెచ్చెట్టి ప్రసాద్, బలగం ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న మామిడి దాన వర ప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఎన్నికల హామీలను అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు మామిడి దాన వర ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ జనరల్‌బాడీ సమావేశం మంగళవారం స్థానిక యూనియన్ ఆఫీస్‌లో యూనియన్ సెక్రటరీ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. దానవర ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు సుమారు 176 హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 17 నెలలు కావస్తున్నా అర, కొర హామీలు మినహా పూర్తి స్థాయిలో హామీలు అమలు చేయలేదన్నారు. బీఓసీ కార్మికులకు సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, నిత్యావసర ధరలు తగ్గించాలని, కల్తీలను అరికట్టాలని, కార్మికులకు సబ్సిడీతో బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో సమరశీల పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. చంద్రశేఖర్, పాండు రంగారావు, ఆదినారాయణ, చిన్ని రాము, నాగేశ్వరరావు, రామకృష్ణారావు, అప్పన్న, శ్యామ్, శివకృష్ణ, నాని, రమేష్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న అరుణకుమారి

తణుకు అర్బన్: కళాశాల విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి యంత్రాంగం కలిసి కట్టుగా పనిచేసి త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి ఎన్‌వీ అరుణ కుమారి అన్నారు. తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. స్కాలర్‌షిప్స్‌కు సంబంధించి విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ చేసే విధానంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 5 స్టెప్ వెరిఫికేషన్‌లో అంచెలంచెలుగా పర్యవేక్షణ ఉండాలని, సచివాలయ వెల్ఫేర్ ఆఫీసర్స్ నుంచి కళాశాలల ప్రిన్సిపాల్స్ ఇతర అధికారులు సైతం పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తణుకు డివిజన్ సహాయ సాంఘిక సంక్షేమాధికారి పీవీడీ ప్రసాద్, ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ, తణుకు అర్బన్, రూరల్, ఇరగవరం మండలాలకు సంబంధించిన కళాశాలల ప్రిన్సిపల్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్, వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు, వసత గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

పెంచిన పని గంటలు తగ్గించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నేతలు

ఇరగవరం: పెంచిన పని గంటలు వెంటనే తగ్గించాలని ఈ మేరకు చట్టాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇరగవరం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చట్టాలను మార్పులు చేయమని వాగ్దానం చేశారన్నారు. అధికారంలోకి వచ్చాక కార్మికుల పొట్ట కొట్టే చట్టాలను చేస్తున్నారని విమర్శించారు. ఈ చట్టాన్ని వెంటనే సవరణ చేయాలని లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని మునిస్వామి హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ జుత్తిగ రామాంజనేయులు, కో–కన్వీనర్ సీహెచ్ విజయకుమారి, జక్కంశెట్టి గంగాధర్‌రావు, వి.నాగలక్ష్మి, జయ వెంకట రమణ, గుబ్బల ముత్యాలు, పెల్లి కోటేశ్వరరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మిస్టరీ మరణాలపై నిగ్గు తేల్చాలి



మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గుంటూరు జిల్లా తురకపాలెంలో మరణాల మిస్టరీపై నిగ్గుతేల్చాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమల్లి మంగరాజు హితవు పలికారు. పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మరణాలపై కూడా బురదజల్లే రాజకీయాలు చేయడం సరికాదన్నారు. దళితుల మరణాలపై ఎమ్మెల్యే రామాంజనేయులు వ్యాఖ్యలు బాధాకరమన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న విషయాన్ని మర్చిపోయారని ఎద్దేవా చేశారు. గత నవంబర్‌లో ఆ గ్రామ దళితులు గుంటూరు కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో మంచినీరు బాగోలేదని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. వాటర్ సమస్యల వల్లే చనిపోయారని, వారికి రూ.కోటి నష్ట పరిహారం ఇవ్వాలని, జాతీయ విపత్తుగా ఆ ప్రాంతాన్ని ప్రకటించాలన్నారు. దళిత సంఘాల నాయకులతో చలో తురకపాలెం వెళ్లడానికి పిలుపునిచ్చేందుకు త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. మాల సంఘాల జేఏసీ నాయకులు సుందర్, రాజేష్, నాగేశ్వరరావు, రమణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో 35.2 మిల్లీ మీటర్ల వర్షపాతం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరి సర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 35.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ మంగళవారం తెలిపారు. పెంటపాడులో 11.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

మున్సిపల్ ఏసీగా నగీనా

తాడేపల్లిగూడెం: మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా నగీనా బేగం సుల్తానాను నియమిస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటి వరకు ఆమె ఏలూరు అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీలో పరిపాలనాధికారిగా పని చేశారు. బదిలీపై ఇక్కడకు రానున్నారు.

వాడవాడలా దసరా ఉత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో దేవి నవరాత్రి ఉత్సవాలను రెండో రోజు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణ ఇలవేల్పు బలుసులమ్మను గాయత్రీదేవిగా విశేష అలంకరణ చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు పర్యవేక్షించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయం అమ్మవారిని శ్రీగజలక్ష్మీదేవిగా విశేష అలంకరణ చేశారు. గౌరవ అధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, కె.శ్రీరామచంద్రమూర్తి, వి.నటరాజు, నున్న సుందరం, ఆర్యవైశ్యులు, మహిళలు పర్యవేక్షించారు. వీకర్స్‌కాలనీ శ్రీగాయత్రీదేవి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా విశేష అలంకరణ నిర్వహించారు. శంకరమఠంలో సర్వమంగళమ్మను బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరణ చేశారు. వేమూరి రామం, మఠం నిర్వాహకులు పర్యవేక్షించారు. శ్రీదేవి మహంకాళమ్మ తల్లి ఆలయంలోని అమ్మవారిని కాత్యాయని దేవిగా అలంకరించారు. నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు

అత్తిలి: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరవల్లి గ్రామంలో వేంచేసి యున్న కనకదుర్గమ్మను మంగళవారం గాయత్రీదేవిగా అలంకరించారు. గ్రామానికి చెందిన కర్రి గవిరెడ్డి, సూర్యలక్ష్మి దంపతులచే అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులచే చండీహోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం (టీఓసీ): గజలక్ష్మీదేవిగా శ్రీవాసవీమాత



తాడేపల్లిగూడెం రూరల్: బ్రహ్మచారిణిగా బాలాత్రిపుర సుందరీదేవి



తాడేపల్లిగూడెం (టీఓసీ): కాత్యాయనీదేవిగా మహంకాళమ్మ

బాలాత్రిపుర సుందరీదేవికి బ్రహ్మచారిణి అలంకరణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం శైవక్షేత్రంలో వేంచేసియున్న శ్రీబాలాత్రిపుర సుందరీదేవిని మంగళవారం బ్రహ్మచారిణిగా అలంకరించి పూజలందించారు. ఈ సందర్భంగా అమ్మవారిని తాడేపల్లిగూడెం ఐటీవో శేఖర్ దంపతులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి మాట్లాడుతూ బ్రహ్మచారిణి అమ్మవారు మనలో జ్ఞాన చైతన్యం కలిగిస్తుందన్నారు. ఇదే రోజున అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి పూజలు అందిస్తామన్నారు. పీఠం ప్రతినిధులు గరిమెళ్ల కృష్ణ సందీప్, ఈమని శశికుమార్ శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మను లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు.



అత్తిలి: శ్రీగాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు



తణుకు అర్బన్: భవానీ మాతకు పూజలు చేస్తున్న మాజీ మంత్రి కారుమూరి

అన్నప్రసాద కార్యక్రమంలో కారుమూరి

తణుకు అర్బన్: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పైడిపర్రు శ్రీ బాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న భవానీ మాలదారులకు అన్నప్రసాద కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ మేరకు కారుమూరికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. మాజీ కౌన్సిలర్ యిండుగపల్లి బలరామకృష్ణ, ఆలయ మాజీ చైర్మన్ చినిమిల్లి సాంబశివరావు సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భవానీ మాల ధరించే మాలధారులకు ఉచితంగా అన్నప్రసాదాన్ని గత నాలుగేళ్లుగా నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, కొత్తపల్లి చరణ్, కంచుమర్తి విశ్వేశ్వరరావు, నిమ్మకాయల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.